మధ్యాహ్న భోజనం.. మరింత నాణ్యం

- 1 నుంచి 8 తరగతులకు కేంద్ర వాటా పెంపు
- వంట ఏజెన్సీలకు కాస్త ఊరట



పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

పాన్‌గల్: మధ్యాహ్న భోజన ఖర్చులకు గాను ఏజెన్సీలకు చెల్లిస్తున్న డబ్బులను ప్రభుత్వం పెంచింది. దీంతో వారికి ఆర్థికంగా కొంత ఉపశమనం కలుగడమే కాకుండా మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెరిగే అవకాశం ఏర్పడుతోంది. ఇప్పటి వరకు తమకు చెల్లించే బిల్లులు తక్కువ ఇస్తున్నారని మధ్యాహ్న భోజనం తయారీ ఏజెన్సీలు ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చాయి. దీంతో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నాణ్యమైన భోజనం అందించలేకపోయారు. ఏళ్లుగా బిల్లులు పెంచకపోవడంతో ఆ ప్రభావం వంట నాణ్యతపై పడుతోంది. దీనిపై తరచూ ఫిర్యాదులు వస్తుండటంతో కేంద్రం స్పందించి 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన బిల్లులు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

9–10 తరగతుల సంగతేమిటి....

మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు మూడు వేలకు పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. తాజాగా పెంచిన నిధులను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన పప్పు, ఆకు కూరలు, పప్పుచారు, వంట నూనెలను వాడాలని అధికారులు ఆదేశిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో 9 నుంచి 10 తరగతి విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి రాష్ట్ర ప్రభుత్వమే నిధులు చెల్లిస్తుంది. ఈ ధరలు కూడా పెంచాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పాఠశాలల్లో ఆహార కమిటీలు

మధ్యాహ్న భోజనం తీరుతెన్నులను పరిశీలించడానికి పాఠశాల స్థాయి నుంచి ఫుడ్ కమిటీలను నియమించారు. వీటిలో ఇద్దరు చొప్పున విద్యార్థులు, ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. భోజనం ఎలా వండుతున్నారో వీరు పరిశీలిస్తారు. భోజనాన్ని రుచి చూశాకే మిగతా విద్యార్థులకు వడ్డించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సర్కార్ బడుల్లో మధ్యాహ్న భోజన పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా అధికారులు కట్టుదిట్టం చేశారు. తాజా కూరగాయాలతో పాటు బియ్యం శుభ్రం చేసి పరిశుభ్రమైన వాతావరణంలో వండి వడ్డించాలని ఆదేశించారు. భోజనాన్ని జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు, మండల స్థాయి అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో భోజనం నాణ్యతగా మెనూ ప్రకారం అందిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు.



పాన్‌గల్ ఉన్నత పాఠశాలల్లో భోజనం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ (ఫైల్)

మండలంలో వివరాలు

తరగతులు	విద్యార్థుల సంఖ్య	పెరిగిన ధరలు (రూ.లలో)		
		తరగతులు	పాత	కొత్త
1-5 తరగతులు	1,281	1నుంచి 5	5.45	6.19
6-8 తరగతులు	920	6 నుంచి 8	8.17	9.29
9-10 తరగతులు	743			

మెనూ ప్రకారం..



పాఠశాలలో ప్రస్తుతం రోజువారీగా రుచికరమైన భోజనం అందుతోంది. గతంతో పోల్చితే వంట నిర్వాహకులు శుభ్రమైన వాతావరణంలో భోజనం వడ్డిస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం, కోడిగుడ్లు అందిస్తున్నారు. ఈ విధానాన్ని ఇలాగే కొనసాగించాలి.

– పల్లవి, 10వ తరగతి, పాన్‌గల్ ఉన్నత పాఠశాల,

9, 10 తరగతులకు కూడా..

ప్రభుత్వం అందించే భోజన బిల్లులు 9, 10 తరగతి విద్యార్థులకు సైతం పెంచి ఆయా బిల్లులు జాప్యం లేకుండా క్రమంగా అందేలా చూడాలి. బిల్లులు రెగ్యులర్‌గా అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అప్పులు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిఅందిస్తున్నాం.

– అలివేలు, వంట ఏజెన్సీ మహిళ, పాన్‌గల్

ఉత్తర్వులు అందాల్సి ఉంది



మధ్యాహ్న భోజన నిధులు పెంచుతున్నట్లు ఇప్పటి వరకు మాకు ఉత్తర్వులు అందలేదు. ఉత్తర్వులు అందిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేస్తాం. భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందిస్తున్నారు. భోజనాన్ని ప్రతినిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– శ్రీనివాసులు, ఎంఈఓ, పాన్‌గల్

‘పార్టీలో చీలికలు తెస్తే సహించేది లేదు’

ఆత్మకూర్: ఎన్నో అవమానలాలు భరించి, నష్టపోయినా కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉండడంతోనే ఎమ్మెల్యేగా అవకాశం లభించిందని, పార్టీలో చీలికలు చేసేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం రాత్రి ఆత్మకూర్‌లో యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన వారికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి కృషి ఫలితంగానే తనకు ఎమ్మెల్యే పదవి వచ్చిందని, ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటానన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన వేణుగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అబ్దుల్లా, అమరచింత, ఆత్మకూర్ మండలాల అధ్యక్షులుగా ఎన్నికైన శరత్‌రెడ్డి, వంశీ ని సత్కరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నాయకులు అయూబ్‌ఖాన్, బాలకిష్టన్న, గంగాధర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, గంగ, నాగేష్, రఫీఖ్, రమేష్, షంశీర్, అరుణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణవర్ధన్‌రెడ్డి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లుకు చెందిన భూమిక కృష్ణవర్ధన్‌రెడ్డి యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో 6,516 ఓట్లతో కృష్ణవర్ధన్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లిలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ అందజేశారు. పార్టీలకు అతీతంగా ఆపదలో ఉన్న వారికి సహాయం చేసేందుకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా గ్రామంలో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విధంగా తామంతా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, రామన్‌గౌడ్, బాజ సిద్ధన్న, కావలి రవి, చిన్నగిరి, కరాటే శివయాదవ్, శ్రీనివాసులు, ఆంజనేయులు, నారాయణ, శివ ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

వీపనగండ్ల: నేరాలు, దొంగతనాల నివారణలో అత్యంత కీలకపాత్ర వహించే సీసీ కెమెరాల ఏర్పాటు కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎస్‌ఐ రాణి విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రధాన కూడలీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలు, నేరాలకు పాల్పడిన వారిని వేగంగా గుర్తించవచ్చన్నారు. డ్రగ్స్, జూదం, పేకాట లాంటి అసాంఘిక చర్యలకు ఎవరూ పాల్పడిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఇటీవల వివిధ సమస్యలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఆర్థికసాయం అందించారు. పాలిశెట్టి చిన్న కిష్టయ్య, హరిజన్ కృష్ణయ్య, హరిజన్ రాములు, కోరమోని అంజనేయులు, గోనెల బాలకిష్టమ్మ ఇటీవల పలు కారణాలతో మృతి చెందారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి సహకారంతో ప్రతి బాధిత కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించామన్నారు. కార్యక్రమంలో ఆగారం ప్రకాష్, క్యామ రాజు, నరేందర్, లింగస్వామి, అజీమ్ పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

పాన్‌గల్: పాత కక్షలను మనుసులో పెట్టుకొని దాడి చేసి గాయపర్చిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొండాయిపల్లికి చెందిన దాసర్ల బాలపీరు, సరిత దంపతులకు ఇదే గ్రామానికి చెందిన పాలివారైన దాసర్ల వెంకటయ్య, దాసర్ల తిరుపతికి భూమి విషయంలో పాత కక్షలు ఉన్నాయి. వీటిని మనుస్సులో పెట్టుకొని ఈనెల 5వ తేదీన మద్యం మత్తులో వెంకటయ్య, తిరుపతి కట్టె, చేతులు, రాయితో దాసర్ల బాలపీరు, సరితకు తలకు, శరీరంపై రక్తగాయాలయ్యాయి. నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దాసర్ల బాలపీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంటి స్థలాలు చూపండి సారూ..



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో గోడును వెల్లబోసుకుంటున్న లబ్ధిదారులు

అమరచింత: దుంపాయికుంటలో తమకు ఇచ్చిన ఇంటి పట్టాల ప్రకారంగా రెండేళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న లబ్ధిదారులకు ఇకనైనా ఇంటి స్థలాలు చూపాలంటూ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం పట్టణంలోని దుంపాయికుంటలో ఇంటి స్థలాలు లేని 400 మంది పేదలకు ప్రభుత్వం ఇంటి పట్టాలను మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు పట్టాల ప్రకారం ఇంటి స్థలాన్ని చూపకపోవడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేక పోయారన్నారు. దీంతో లబ్ధిదారులకు బాసటగా రెండేళ్ల కిందట సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెల పోరాటం నిర్వహించగా లబ్ధిదారులు సొంత ఖర్చులతో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడే ఉన్న తహసీల్దార్‌ను పిలిచి వారం రోజుల వ్యవధిలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలను పంపిణీ చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వెంకటేష్, ఆర్‌ఎస్ రమేష్, అజయ్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులు మెరుగుపర్చాలి



శ్రీరంగాపురం కస్తూర్బా పాఠశాలలో..



వీపనగండ్లలో విద్యార్థులకు అందించే మాత్రలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

వీపనగండ్ల: ప్రభుత్వ హాస్టల్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన వసతులు కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ చదువుపై ధ్యాస ఉంచట్లేదని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన వారు బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్ల వసతులు లేకపోవడం, సరైన భోజనం అందివ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు గురుకులాల బాట కార్యక్రమంలో పలు పాఠశాలలను సందర్శించగా.. నిత్యవసర సరుకులు, నాణ్యమైన భోజనం అందడం లేదని విషయం స్పష్టమైందన్నారు. కార్యక్రమంలో అమరేందర్, శివప్రసాద్, లక్ష్మణ్‌గౌడ్, నవాజ్, షరీఫ్, అఖిలేందర్, మన్సూర్, శివయాదవ్, హేమంత్ పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

శ్రీరంగాపూర్: బీఆర్‌ఎస్ అధిష్టానం పిలుపు మేరకు గురుకుల బాటలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేస్తుందని దుయ్యబట్టారు. నాణ్యమైన భోజనం అందించకుండా సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు వచ్చే కూరగాయలు, బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పురుగులు లేని నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ ఇన్‌చార్జ్ శివ యాదవ్, హేమంత్, శ్రావణ్, అమరేందర్,లక్ష్మణ్, నవాజ్ తదితరలు పాల్గొన్నారు

వినతిపత్రం అందజేత



వనపర్తి విద్యావిభాగం: సమస్యలు పరిష్కరించాలంటూ విద్యా శాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి చేపట్టే రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు జిల్లా జేఏసీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డీఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కమిటీ సభ్యులు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొద్దారెడ్డి, శ్రీనివాసరెడ్డి, డీపీఓ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆలయ భూమిని రక్షించాలని వినతి



చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ పరిరక్షణ సభ్యులు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని సంత భూమి, వేణుగోపాలస్వామి ఆలయ భూమిని కాపాడాలంటూ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో శుక్రవారం ఆలయ భూమి పరిరక్షణ సమితి సభ్యుడు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి వినతిపత్రం అందజేశారు. మండలంలోని సంతకు కేటాయించిన స్థలం , అదేవిధంగా వేణుగోపాల స్వామి ఆలయ భూమిని స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారి నుంచి భూమిని కాపాడాలని విన్నవించారు. గత ప్రభుత్వం ఈ భూమిపై ఇచ్చిన ఓఆర్‌సీని కూడా రద్దు చేయాలని కోరారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శాంతమ్మ

పాన్‌గల్: చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకునేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమయానికి వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవడంతో వారిని రోగాల నుంచి కాపాడవచ్చన్నారు. గర్భిణుల నమోదు, పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలను వివరిస్తూ పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీబీ వ్యాధి నివారణ, ఎయిడ్స్ వ్యాధి నివారణపై గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

సత్యశోధన యాత్రకు ఘనస్వాగతం



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా రిటైర్డ్ ఎంఈఓ విజయ్‌కుమార్ ‘పిల్లల భవిత కోసం’ అనే నినాదంతో జోగులాంబ ఆలయం నుంచి ఉమామహేశ్వరం ఆలయం వరకు చేపట్టిన సత్యశోధన పాదయాత్ర శుక్రవారం కొత్తకోట మండలం మిరాసిపల్లికి చేరుకుంది. మిరాసిపల్లి వద్ద స్థానిక ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. జెడ్పీహెచ్ఎస్. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం విజయ్‌కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ జీవితం, అహింసా సిద్ధాంతం, నైతిక ధార్మిక విలువల గురించి వివరించారు. విద్యార్థులు దేశభక్తితో నడవాలని, పుస్తక పఠనానికి ప్రాముఖ్యత నిచ్చి ఎక్కువ జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ పాదయాత్ర విద్యార్థులకు మానసిక ప్రేరణ కలిగిస్తూ, విలువలతో జీవించేందుకు మార్గం చూపుతుందని ప్రశంసించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ కిరణ్‌కుమార్

పాన్‌గల్: విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ అంశాలలో పరిజ్ఞానాన్ని పెంచే ఇతర పుస్తకాలు చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మోటివేటర్ కిరణ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కలెక్టర్ పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన స్ఫూర్తి మోటివేషన్ కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ఎస్‌ఓ హేమలత అధ్యక్షతన నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఆరోగ్యపరమైన విషయాలపై పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ బాలికలకు అవగాహన కల్పించారు.

గురుకుల పాఠశాల లైబ్రేరియన్‌కు డాక్టరేట్



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న మేఘావత్ రవి ఫార్మసీ విభాగంలో డాక్టరేట్‌ను పొందాడు. పెద్దమందడి మండలంలోని గట్లఖానాపూర్‌కు చెందిన గిరిజన విద్యార్థి అయిన మేఘావత్ రవి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ తీసుకున్నారు. శుక్రవారం గురుకుల ప్రిన్సిపాల్ గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రవిని సన్మానించారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

వనపర్తి రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయిన ఘటన అంజనగిరి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడేరు మండలంలోని సింగాయిపల్లితండాకు చెందిన బాబునాయక్ బైక్‌పై వనపర్తికి వచ్చి తిరిగి పాన్‌గల్ మండలంలోని అన్నారంతండాకు బైక్‌పై వెళ్తుండగా వనపర్తి మండలంలోని అంజనగిరి వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర రక్తగాయాలు కాగా వారిని స్థానికులు అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాన్‌గల్ మండలంలోని కొత్తపేటకు చెందిన తిర్మల్ వనపర్తి ప్రభుత్వ ఆస్పతిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం బాబునాయక్‌ను కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

సాక్షి, నెట్‌వర్క్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సమన్యాయం అందించాలనే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని రచన చేశారన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

- ఆత్మకూర్, అమరచింత పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, దళిత సంఘాల నాయకులు వేరువేరుగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, గాలిపంపు శ్రీను, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.
- కొత్తకోట మున్సిపాలిటీలో గల అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, సలీంఖాన్, లక్ష్మయ్య, ఇసాక్, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.



ఆత్మకూర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి

- వనపర్తి జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ, హ్యూమన్ రైట్స్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో, మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమారస్వామి, నారాయణ, సుగూరు రాములు, రాయన్నసాగర్, రాజారాంప్రకాశ్, గిరిరాజాచారి, దేవన్న, బాలేమియా, నరసింహారెడ్డి, జీటీ శ్యామ్, విశ్వంబాబు, అంజనేయులు, గోర్ల శైలన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- పాన్‌గల్ మండలంలోని కేతేపల్లిలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాన్‌గల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి దివ్యాంగుల సంఘం, లిటిల్ స్టార్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అన్నారంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు వహీద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.
- ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి



గోపాల్‌పేటలో..



పాన్‌గల్‌లో..

సీపీఐ నాయకులు కొణవమ్మ, రమేశ్, గోపాలకృష్ణ, మహేశ్ నివాళులర్పించారు.

- ఖిల్లాఘనపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య ఉన్నారు.
- వీపనగండ్ల మండలంలోని కల్వరాలలో అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ పాల్గొన్నారు.
- పెబ్బేరులోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గోవింద్ నాయుడు, రాంచంద్రయ్య , నరసింహ, నాగరాజు, గువ్వల గోపాల్ ఉన్నారు.